# నమస్తే తెలంగాణ
## ఆదిలాబాద్ - నిర్మల్
5 | నిజామాబాద్ శనివారం 17 మే 2025 | ADILABAD NIRMAL


# ప్రశ్నిస్తే కేసులు పెడుతారా.. ?

● ఇదెక్కడి న్యాయం ? ● బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్

నేరడిగొండ, మే 16 : టీజీపీఎస్సీ వెల్లడించిన గ్రూప్-1 ఫలితాలపై నిరుద్యోగుల పక్షాన ప్రశ్నించిన ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై అట్రాసిటీ కేసు నమోదు చేయడం, ప్రశ్నించే వారిపై కేసులు పెట్టడం ఇదెక్కడి న్యాయమని బోథ్ ఎమ్మెల్యేజాదవ్ అనిల్ కాంగ్రెస్ ప్రభుత్వా న్ని ప్రశ్నించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. కొంతమందికి గ్రూప్-1 పరీక్షల్లో సీక్వెన్స్‌గా ఎక్కువ మా ర్కులు రావడం, అందులో రాములు నాయక్ కోడలికి టాప్ ర్యాంకు రావడంపై అనుమానం వ్యక్తం చేయడం తప్పెలా అవుతుందన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరికీ ప్రశ్నించే హక్కు ఉందన్నారు. ఇది రాములు నాయక్ పెట్టిన కేసు కాదని, నెల ముందు పాడికౌశిక్‌రెడ్డి ప్రెస్‌మీట్‌లో మాట్లాడితే ఇప్పుడు కేసు నమోదు చేయడంపై కాంగ్రెస్ పెద్దలు కావాలని చేశారని అనుమానం నెలకొన్నదన్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావ్, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై కాంగ్రెస్ ప్రభుత్వం కేసులు పెట్టి భయపెట్టాలని చూస్తున్నదన్నారు. గతంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిపక్షం బలంగా ఉంటేనే ప్రభుత్వం మంచిగా నడుస్తదన్నారని, మేము ప్రతిపక్ష పార్టీగా బలంగా మాట్లాడితే కేసులు పెట్టడం ఏమిటని ప్రశ్నించారు. అలా అనుకుంటే ముందుగా సీఎం పైనే అట్రాసిటీ కేసు నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. ఎందుకంటే 17 మంది గిరిజన విద్యార్థులపై చదువుల కోసం అమెరికా వెళ్లి స్కాలర్‌షిప్ అందక రోడ్డుపై తిరుగుతున్నారని అన్నారు. ఈ విషయంలో అసెంబ్లీలో కూడా తాను ప్రస్తావించినట్లు కానీ ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు ఎలాంటి స్పందన లేదన్నారు. గిరిజన విద్యార్థులకు కనీసం కూలీ పనులు కూడా దొరకడం లేదని తమకు తరచూ ఫోన్ చేస్తున్నారని తెలిపారు. ఇప్పటి వరకు ప్రభుత్వం గిరిజన మంత్రి పదవి ఇవ్వకుండా జాప్యం చేయడంపై గిరిజనులపై ప్రభుత్వం ఎంత పక్షపాతంగా వ్యవహరిస్తోందో అర్థమవుతుందన్నారు. బీఆర్ఎస్ పార్టీ దళిత అధ్యక్షుడిని చేయాలన్న ముఖ్యమంత్రి అన్న వ్యాఖ్యలకు, ముందుగా మీ పార్టీలో ఉన్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను ముఖ్యమంత్రి చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికైనా గమనించి ప్రశ్నించే ప్రతి ఒక్కరిపై కేసులు నమోదు చేయడం మానుకోవాలన్నారు.



మాట్లాడుతున్న బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్


ఎదులాపురం : డెంగీ నివారణపై కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

# డెంగీ, మలేరియాపై అప్రమత్తంగా ఉండాలి

● దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి ● ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా

ఎదులాపురం, మే16: దోమలతో వ్యాప్తి చెందే డెంగీ, మలేరియా, ఫైలేరియా తదితర వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా అన్నారు. జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఆదిలాబాద్ పట్టణంలోని కేఆర్కే కాలనీలోని బస్తీ దవాఖానలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కలెక్టర్ రాజర్షి షాకు డీఎంహెచ్‌వో పూలమొక్కను అందజేసి స్వాగతం పలికి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దోమల ద్వారా వ్యాప్తి చెందే వ్యాధులపై అన్ని శాఖల సమన్వయంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే ఫ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించి పరిసరాలను శుభ్రం చేసుకోవాలన్నారు. మురుగునీటితో దోమ లార్వా వ్యాప్తి చెందుతుందని తెలిపారు. డెంగీ, మలేరియా, వైరల్ ఫీవర్ కేసులు పెరిగితే వైద్య శిబిరాలు నిర్వహించాలన్నారు. ప్రైవేట్ దవాఖానలో డెంగ్యూ నిర్ధారణ పరీక్షల యంత్రం లేదని కేవలం రిమ్స్ దవాఖానలోనే ఉందని స్పష్టం చేశారు. నీటి సమస్యలు పరిష్కరిస్తామన్నారు. ఏఎంసీ పరీక్షలు నిర్వహించాలని, అవసరం ఉన్న సమయంలోనే ప్రభుత్వ వాహనంలోనే పంపించాలన్నారు. అంగన్‌వాడీ కోసం పక్కా భవనం నిర్మాణానికి ప్రతిపాదనలను పరిశీలిస్తామన్నారు. అనంతరం డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ మాట్లాడుతూ.. వ్యాధుల నివారణే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం టీబీ వ్యాధి గ్రామస్తులకు కలెక్టర్ నిక్షయా పోషన్ కిట్లను అందజేశారు. అనంతరం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీఎంహెచ్‌వో సాధన, జిల్లా మలేరియా ఆఫీసర్ ఎం. శ్రీధర్, జిల్లా టీబీ నియంత్రణ అధికారి సుమలత, మున్సిపల్ కమిషనర్ సీవీఎన్ రాజు, మెడికల్ ఆఫీసర్లు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

### డెంగ్యూ నిర్మూలనకు కృషి చేయాలి

నిర్మల్ చైన్‌గేట్, మే,16 : డెంగీ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ నిర్మల్ డీఎంహెచ్‌వో రాజేందర్ అన్నారు. జాతీయ డెంగీ దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్మల్‌లో శుక్రవారం వైద్య సిబ్బంది భారీ ర్యాలీ తీశారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ జిల్లాలో ప్రతి శుక్రవారం, మంగళవారం డ్రై డేగా పాటించి నీటి నిల్వలను తొలగించాలని, పరిసరాల శుభ్రత పాటించి దోమలను నిర్మూలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమ నిర్వహణ అధికారి శ్రీనివాస్, డిప్యూటీ జిల్లా విస్తరణ అధికారి బారె రవీందర్, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్, వైద్యాధికారులు తేజస్విని, మనిషా, డీపీహెచ్‌ఎన్‌వో సాయమ్మ, ఆరోగ్య పర్యవేక్షకులు భోజారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మహేందర్, మతిన్, ఆరోగ్య సహాయకులు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.


నిర్మల్ చైన్‌గేట్ : ర్యాలీ తీస్తున్న అధికారులు, సిబ్బంది


బీఆర్ఎస్ నాయకులను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు బస్సులో తరలిస్తున్న పోలీసులు


నర్సాపూర్ (జీ) పోలీస్‌స్టేషన్‌లో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

# రైతులను ఇబ్బంది పెడితే ఊరుకోం

● బీఆర్ఎస్ నాయకుల నిరసన
● మంత్రులను అడ్డుకున్న నాయకులు, కార్యకర్తల అరెస్ట్


మంత్రుల రాకను అడ్డుకుంటున్న బీఆర్ఎస్ నాయకులను అరెస్ట్ చేస్తున్న పోలీసులు

భైంసా/భైంసాటౌన్,/కుంటాల, మే, 16 : రైతులను ఇబ్బంది పెడితే ఊరుకోబోమని, ధాన్యం కొనుగోళ్లలో తరుగు పేరిట కోత విధించవద్దని, ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని బీఆర్ఎస్ ముథోల్ నియోజకవర్గ నాయకులు డిమాండ్ చేస్తూ శుక్రవారం కుంటాల మండలానికి వచ్చిన రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్కను అడ్డుకోవడానికి యత్నించారు. వారిని పోలీసులు అరెస్టు చేసి నర్సాపూర్ (జీ) పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ముథోల్ నియోజకవర్గ బీఆర్ఎస్ సమన్వయ సమితి సభ్యుడు డాక్టర్ కిరణ్ కొమ్రేవార్, జడ్పీ మాజీ చైర్మన్ లోలం శ్యాంసుందర్ మాట్లాడుతూ రైతులు కష్టపడి పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో తాలు, తప్ప పేరిట క్వింటాలుకు 5 కిలోలు కోత విధించడం అన్యాయమని, రైతులకు అన్యాయం చేస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు బంధు బందైపోయిందన్నారు. కల్యాణలక్ష్మితో పాటు తులం బంగారం ఇస్తామని ఇప్పటికీ అమలు చేయలేదన్నారు. ఆరు గ్యారెంటీలు అమలు చేసే వరకూ ప్రశ్నిస్తునే ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కుంటాల మండల నాయకులు దత్తాద్రి, బీఆర్ఎస్ సోషల్ మీడియా ఇన్‌చార్జి దశరథ్, రజినీకాంత్, శ్రీనివాస్, పోశెట్టి, రమేశ్, లక్ష్మణ్, మహేశ్, రావుల పోశెట్టి, రవి, రావుల వనిత, హస్దే సజన్, తదితరులు ఉన్నారు.

### అరెస్టయిన నాయకులతో ఫోన్‌లో మాట్లాడిన కేటీఆర్

ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని కుంటాల మండలానికి వచ్చిన మంత్రులను బీఆర్ఎస్ నాయకులు అడ్డుకోవడంతో వారిని పోలీసులు అరెస్ట్ చేసి నర్సాపూర్ పోలీస్ స్టేషన్ తరలించారు. ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముథోల్ నియోజకవర్గ బీఆర్ఎస్ సమన్వయ సమితి సభ్యుడు విలాస్ గాదేవార్‌తో ఫోన్‌లో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని కేసులు పెట్టినా భయపడవద్దన్నారు. మరిన్ని పోరాటాలకు సిద్ధంగా ఉండాలన్నారు. పోలీస్‌స్టేషన్ నుంచి 2 గంటల్లో విడుదల చేయకపోతే బీఆర్ఎస్ లీగల్ టీంను పంపిస్తానని నాయకులు, కార్యకర్తలకు కేటీఆర్ భరోసానిచ్చారు. ఆయన వెంట ముథోల్ నియోజకవర్గ బీఆర్ఎస్ సమన్వయ సమితి సభ్యులు కిరణ్ కొమ్రేవార్, లోలం శ్యాం సుందర్, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల కమిటీ సభ్యులను తొలగించాలి

బోథ్, మే 16 : సొనాల మండలానికి కేటాయించిన ఇందిరమ్మ ఇళ్ల జాబితా కేటాయింపులో జాప్యం చేస్తున్న కమిటీ సభ్యులను వెంటనే తొలగించాలని యువ శక్తి యూత్ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులే పూర్తి స్థాయి జాబితా తయారు చేసి అర్హులకు న్యాయం చేయాలని కోరారు. ఇప్పటికే పలు మార్లు జాబితాలో పేర్లు మారాయని పేర్కొన్నారు. కమిటీ సభ్యులు ఎవరికి ఇష్టం వచ్చిన వారి పేర్లు జాబితాలో ఎక్కిస్తున్నారని ఆరోపించారు. సొనాలలోని ఇందిరమ్మ కమిటీ రద్దు చేయాలని, అర్హులకే ఇండ్లు కేటాయించాలని కోరారు.

# ఖాళీ బిందెలతో మహిళల నిరసన


సుభాష్‌నగర్ గోండుగూడ కాలనీలోని ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

**తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరుతూ** నిర్మల్ జిల్లా ఖానాపూర్ పట్టణంలోని సుభాష్‌నగర్ గోండుగూడలో శుక్రవారం ఖాళీ బిందెలు, బకెట్లతో మహిళలు సీసీ రోడ్డుపై నిరసనకు దిగారు. ఐదు రోజులుగా తాగునీటి సరఫరా లేక ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని వాపోయారు. ఉన్నత అధికారులు స్పందించి తమకు తాగునీటి సరఫరా చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇంద్ర, పోసాని, కమల, గంగవ్వ, సాయవ్వ తదితరులు ఉన్నారు.

*- ఖానాపూర్, మే 16*

# ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేసేలా చర్యలు

నిర్మల్ చైన్‌గేట్/ఎదులాపురం మే, 16: జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేసేలా చర్యలు తీసుకుంటున్నామని నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పేర్కొన్నారు. హైదరాబాద్ నుంచి శుక్రవారం రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావ్, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, పౌర సరఫరాల శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ధాన్యం కొనుగోళ్ల వివరాలు సేకరించారు. ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని, కొనుగోలు కేంద్రాల్లో వసతులు కల్పించి రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. అనంతరం కలెక్టర్లు వేర్వేరు సమావేశాల్లో జిల్లా అధికారులతో మాట్లాడుతూ కొనుగోలు ప్రక్రియ గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్‌లు అందుబాటులో ఉంచాలన్నారు. ట్యాబ్‌ల ద్వారా రోజువారీగా కొనుగోలు వివరాలు నమోదు చేయాలని సూచించారు. రిజిస్టర్లు పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ప్రతి ధాన్యపు గింజ కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. నిర్మల్ కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, ఆర్డీవో, ఇన్‌చార్జి డీఎస్వో కోమల్‌రెడ్డి, సివిల్ సప్లయ్ డీఎం సుధాకర్, అధికారులు పాల్గొన్నారు. ఆదిలాబాద్ కలెక్టరేట్ నుంచి నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రాజర్షి షా, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి వాజిద్ అలీ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీధర్ స్వామి, జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజర్ సుధారాణి, తదితరులు పాల్గొన్నారు.


వీసీలో మాట్లాడుతున్న నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్

# ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్ల నిరసన

### శిక్షణకు పంపించాలని డిమాండ్

ఎదులాపురం, మే16 : ఆర్టీసీలో అద్దెబస్సు డ్రైవర్ల పోస్టులకు తమను ఎంపిక చేసి శిక్షణకు పంపించకుండా రెండు నెలలుగా ఇబ్బంది పెట్టడంపై శుక్రవారం ఆర్టీసీ రిజియన్ వ్యాప్తంగా డ్రైవర్లు ఆర్ఎం కార్యాలయానికి చేరుకొని నిరసన తెలిపారు. అంతకు ముందు ఆర్ఎంను కలిసి సమస్యను విన్నవించారు. ఈ సందర్భంగా డ్రైవర్ సతీశ్ మాట్లాడుతూ మార్చి నెలలో ఎంప్లాయిమెంట్ కార్యాలయం నుంచి తమకు ఆర్టీసీలో హైర్ బస్సు డ్రైవర్ల భర్తీకి కాల్ వచ్చిందన్నారు. తాము ఇంటర్వ్యూలు, డ్రైవింగ్ టెస్టులో ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. మార్చి 18న హకీం పేటలో ట్రైనింగ్ ఉంటుందని సిద్ధంగా ఉండాలని ఎంపికైన 70 మందికి తెలియజేశారన్నారు. ట్రైనింగ్‌కు పిలుస్తారేమోనని రెండు నెలలుగా ఖాళీగా ఉంటున్నామని, దీంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై కలెక్టర్‌కు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు.


ఆర్టీసీ ఆర్ఎం కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న అద్దె బస్సుల డ్రైవర్లు

# జోరువాన

● కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బంది పడ్డ జొన్న రైతులు
● తాంసిలో పిడుగుపాటుకు రావి చెట్టు దగ్ధం
● పలు చోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం


తాంసిలో పిడుగు పాటుకు దగ్ధమవుతున్న రావి చెట్టు


ఇచ్చోడ మార్కెట్ యార్డులో జొన్నలపై టార్పాలిన్ కవర్లు కప్పిన రైతులు

ఇచ్చోడ, మే 16 : ఇచ్చోడ, సిరికొండ మండలాల్లో శుక్రవారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. ఇచ్చోడ, సిరికొండ మండలాల యార్డుల్లో జొన్నలు విక్రయించడానికి వచ్చిన రైతులు ఇబ్బంది పడ్డారు. టార్పలిన్‌లు కప్పి ధాన్యం తడసిపోకుండా కాపాడుకున్నారు. సిరికొండలో శాశ్వత మార్కెట్ యార్డు ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు. ఈదురుగాలులతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

### భీంపూర్ మండలంలో..

తాంసి(భీంపూర్), మే 16 : భీంపూర్ మండలంలోని నిపాని, పిప్పల్‌కోటి, తదితర గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం మోస్తారు వర్షం కురిసింది. అక్కడక్కడ జొన్నలను చేల నుంచి తీసుకెళ్లేందుకు రైతులు ఇబ్బంది పడ్డారు.

### ఇంద్రవెల్లి మండలంలో..

ఇంద్రవెల్లి, మే 16 : మండలకేంద్రంతోపాటు గ్రామాల్లో శుక్రవారం రాత్రి 7గంటల నుంచి భారీ వర్షం మొదలైంది. పలు చోట్ల విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగింది. ఉక్కపోతతో ఇబ్బంది పడ్డ ప్రజలు వర్షంతో ఉపశమనం పొందారు.

### రావి చెట్టుపై పిడుగు.. తప్పిన ప్రమాదం

తాంసి, మే 16 : మండల కేంద్రంతోపాటు పొన్నారి, హస్నాపూర్, వడ్డాడి, కప్పర్ల, గిరిగామ గ్రామాల్లో ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసింది. తాంసి మండల కేంద్రం సమీపంలోని పాఠశాల వెనకాల పంట చేనులో రావి చెట్టుపై పిడుగు పడింది. పిడుగు ధాటికి రావి చెట్టు దగ్ధమైంది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పిందని గ్రామస్తులు తెలిపారు.